నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 11 జనవరి 2025 | KAMAREDDY

- కామారెడ్డి జిల్లాలో ఫేక్ డాక్టర్లు
- ప్రైవేట్ దవాఖానాల్లో చెలామణి
- సంపాదన కోసం అడ్డదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- కాసుల కోసం ఇష్టారీతిన అనుమతులు

**నకిలీలు, అక్రమాలకు కామారెడ్డి జిల్లా చిరునామాగా మారింది.** నకిలీకి కాదేది అనర్హం అన్నట్లుగా అనేక ఉదంతాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లు, నకిలీ కరెన్సీ వెలుగుచూడగా, కొంతకాలంగా నకిలీ వైద్యులు పట్టుబడుతున్నారు. ఫేక్ సర్టిఫికెట్లతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేపడుతున్నారు. తాజాగా రెండురోజుల క్రితం డిగ్రీ ఫెయిలైన ఓ వ్యక్తి జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో డాక్టర్‌గా చెలామణి కావడం నకిలీ పర్వాల పరిస్థితికి అద్దం పడుతున్నది. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం గమనార్హం.

–కామారెడ్డి, జనవరి 10

# 'నకిలీ' వైద్యం!

ప్రజల ప్రాణాలతో చెలగాటం




**కామారెడ్డి** జిల్లా కేంద్రంలో గతేడాది నుంచి అక్రమంగా శిశు విక్రయాలు, చట్ట విరుద్ధంగా స్కానింగ్‌లు, నకిలీ వైద్యులు పట్టుబడడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు వెలుగుచూసినప్పుడు హడావుడి చేసే అధికారులు..విచారణ చేపట్టకుండా నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిరోజుల క్రితం పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలో ఒకరు ఏకంగా తన ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జిల్లాలో సంచలనం రేపింది. ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నాడు. ఇతర రాష్ర్టాల నుంచి వచ్చిన వారికి స్కానింగ్ చేసి అందినకాడికి దోచుకున్నాడు. ఈ అక్రమ దందాకు వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న కొందరు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**బయటపడుతున్న 'ప్రైవేట్' నిర్వాకం**

ప్రభుత్వ దవాఖానల కన్నా ప్రైవేట్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో వస్తున్న రోగులకు నిరాశే ఎదురవుతున్నది. దవాఖానలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది అర్హతలపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దవాఖానలను నిర్వహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తమను అడిగే వాడులేడనే భావనతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

**వైద్యాశాఖ అనుమతులు తప్పనిసరి**

ఎవరైనా వైద్యులు తమ వైద్య వృత్తిని నిర్వహించుకోవాలంటే ముందుగా డీఎంహెచ్‌వో నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వైద్యకోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లను సమర్పించాలి. వైద్యాధికారులు సదరు సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాతే దవాఖాన ఏర్పాటుకు అనుమతులు జారీ చేస్తారు. అలాగే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెంబర్‌షిప్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎప్పటికప్పుడు ప్రైవేట్ దవాఖాలను తనిఖీలు చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ దవాఖానల్లో అసలేం జరుగుతుందనే విషయం ఎవరికీ తెలియడం లేదు. అనుకోకుండా చోటుచేసుకుంటున్న ఘటనల్లో దవాఖాన యాజమాన్యం నిర్వాకం బయటపడుతున్నది. పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో రవీందర్ రెడ్డి పేరు మీద డిగ్రీ ఫెయిలైన వ్యక్తి డాక్టర్‌గా చెలామణి అవుతుండగా.. అనుమానం వచ్చిన ఐఎంఏ ప్రతినిధులు అతడి నిజస్వరూపం బయటపెట్టారు. అతడు డాక్టరే కాదని నిర్ధారించారు. ఈ వ్యవహారం ఇలా నకిలీ సర్టిఫికెట్లతో ప్రైవేట్ దవాఖానల్లో ఇంకా ఉన్నారనడానికి బలం చేకూరుస్తున్నది. ఇతర జిల్లాకు చెందిన రవీందర్‌రెడ్డికి కామారెడ్డిలోని ప్రైవేట్ దవాఖానలో ఏవిధంగా వైద్యుడిగా కొనసాగించారనే సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రజల జీవితాలతో నకిలీ వైద్యులు చెలగాటం ఆడుతుంటే.. ప్రభుత్వ వైద్యాధికారులు ఏం చేస్తున్నారనే అనుమానాలు మొదలవుతున్నాయి. రాజకీయనాయకులు, అధికారుల పలుకుబడితో వైద్య వృత్తికి సంబంధం లేని వ్యక్తులు జిల్లాకేంద్రంలో దవాఖానలను నిర్వహిస్తుండడం గమనార్హం. తక్కువ మొత్తంలో జీతాలకు నామమాత్రంగా వైద్యులను తీసుకువచ్చి దవాఖానలు నడుపుతున్నారు. ఇదంతా వైద్యాధికారులకు తెలిసినా కాసులకు కక్కుర్తి పడి అనుమతులు ఇస్తున్నారు. పట్టణంలో మల్టీ స్పెషాలిటీ దవాఖానలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి అర్హత లేని వారు వైద్యవృత్తిని కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై కామారెడ్డి జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్‌కు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు.

**జిల్లాలో నకిలీ వైద్యుల గుర్తింపు..**

జిల్లాలో నకిలీ వైద్యులు కోకల్లలుగా పుట్టుకొస్తున్నారు.గతంలో చాలా మంది నకిలీ వైద్యులను అరెస్టు చేసి, క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపించారు. అయినా నకిలీ వైద్యులు పట్టుబడుతూ ఉన్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో వైద్య వృత్తిని ఎంచుకుంటున్నట్లు తెలుస్తున్నది. ప్రైవేట్ దవాఖాన హంగు ఆర్భాటాలు చూసి రోగులకు అక్కడికి వెళ్లి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. వైద్య వృత్తిని అడ్డంపెట్టుకొని కొందరు డబ్బులను దండుకుంటున్నారు.

**తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి**



కొత్త వైద్యులు డీఎంహెచ్‌వో కార్యాలయంలో తప్పకుండ అనుమతులు తీసుకోవాలి. జిల్లాలో ఎక్కడైనా దవాఖాన ఏర్పాటు చేయాలన్నా సర్టిఫికెట్లను చూపించాలి. ప్రజల జీవితాలతో ఆడుకునే నకిలీ వైద్యులను కఠినంగా శిక్షించాలి. దీనిపై ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

-డాక్టర్ అరవింద్,
ఐఎంఏ కార్యదర్శి

## రసరమ్యం.. రామాయణ దృశ్యకావ్యం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రామాయణ గాథను కండ్ల ముందు ఆవిష్కరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పదో తరగతికి చెందిన 80 మంది విద్యార్థులు రాముడి జననం నుంచి పట్టాభిషేకం వరకు దృశ్యరూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సుమారు గంట పదిహేను నిమిషాలపాటు కొనసాగిన ఈ ప్రదర్శనలో రాముడు, లక్ష్మణుడు, సీత, ఆంజనేయుడి వేషధారణలో అలరించారు. దృశ్యరూప కావ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులను డీఈవో అశోక్ అభినందించారు.

– కోటగిరి, జనవరి 10



## విద్యార్థులు.. గంజాయి విక్రేతలు

- మత్తుకు అలవాటు పడి.. పక్కదారి పట్టిన యువకులు
- నలుగురు విద్యార్థులతో పాటు మైనర్ అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

వినాయక్‌నగర్, జనవరి 10: చదువుకోవాల్సిన విద్యార్థులు పక్కదారి పట్టారు. బంగారు భవిష్యత్తును పణంగా పెట్టి మత్తుకు అలవాటు పడ్డారు. గంజాయి విక్రేతలుగా మారిన ఆ విద్యార్థుల ఆట కట్టించారు పోలీసులు. నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ తెలిపిన వివరాల మేరకు.. గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు వినాయక్‌నగర్ న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అమరవీరుల పార్కు గల షెడ్డుపై శుక్రవారం దాడి చేశారు. అక్కడ గంజాయిని ప్యాకెట్లలో నింపుతున్న ఆకాశ్, రోహిత్, శివరాణా రామతేజ్‌రెడ్డి, రాకేశ్‌తో పాటు మరో బాలుడ్ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 461 గ్రాముల గంజాయితో పాటు ఐదు సెల్ ఫోన్లు, కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారి గురించి పోలీసులు విచారించగా, వారంతా విద్యార్థులేనని తేలింది. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. నలుగురు యువకులను రిమాండ్‌కు, బాలుడ్ని జువైనల్ హోంకు తరలించారు. యువత, విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు కన్నేసి ఉంచాలని సీఐ సూచించారు. నిందితులను పట్టుకున్న ఎస్సై శ్రీకాంత్‌తో పాటు సిబ్బందిని ఏసీపీ రాజా వెంకటరెడ్డి అభినందించారు.



ఉత్తర తిరుపతి క్షేత్రంలోని ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తున్న స్వామివారు

నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్ రామాలయం వద్ద స్వామివారి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



## ముక్కోటి వైభవం

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనం
- పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు

**వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని** ఉమ్మడి జిల్లాలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శైవ, వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకున్నారు. నిజామాబాద్ నగరంలోని గంగస్థాన్ ఫేస్–2లో ఉన్న ఉత్తర తిరుపతి క్షేత్రం, నీలకంఠేశ్వరాలయం, జెండాబాలాజీ మందిరం, సుభాష్‌నగర్ రామాలయం, బ్రహ్మపురి చక్రంగుడి, బడా రాంమందిరం, ఖిల్లా రఘునాథాలయంతోపాటు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

# కదం తొక్కిన రైతులు

- ఆరు గ్యారెంటీల అమలుపై పోరుబాట
- తాడ్వాయి నుంచి కామారెడ్డి కలెక్టరేట్ వరకు పాదయాత్ర
- పాల్గొన్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ శ్రేణులు




రైతుపోరుబాట పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, రైతులు, బీఆర్ఎస్ నాయకులు

లింగంపేట(తాడ్వాయి)/కామారెడ్డి, జనవరి 10: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడ్వాయి నుంచి కామారెడ్డి కలెక్టరేట్ వరకు రైతు పోరుబాట పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులతో కలిసి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే రూ. 2 వేల పింఛన్ రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇవ్వలేదని మండిపడ్డారు. రూ. 2 లక్షల రుణమాఫీ కేవలం 50 శాతం మంది రైతులకు మాత్రమే చేశారని తెలిపా రు. మిగతా వారికి కూడా వెంటనే మాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి, రూ. 12వేలకు కుదించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌలు రైతుకు రూ. 12వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. కల్యాణలక్ష్మి కింద రూ. లక్షతోపాటు తులం బంగారం ఇస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా మాసం బంగారం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చడానికి హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎన్నికల కోసం గ్రామాల్లోకి వస్తే అడుగుపెట్టనీయబోమని హెచ్చరించారు. 15కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్‌కు చేరుకొని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తాడ్వాయి విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహులు, బీఆర్ఎస్ లింగంపేట మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, నాయకులు సాయిరెడ్డి, రాజారెడ్డి, మంగారెడ్డి, సంజీవులు, రమేశ్, వెంకట్రావు, రాజారెడ్డి, తిరుపతిరెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పోచారం ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల ఆందోళన
- ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్

## పోచారం ఇంటి ముట్టడి

బాన్సువాడ టౌన్, జనవరి 10: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని ఆశ కార్యకర్తలు శుక్రవారం బాన్సువాడలోని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఇంటిని ముట్టడించారు. పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి పోచారం ఇంటి వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటి ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది ముగిసినా ఆశ వర్కర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ఆశ వర్కర్లకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు, ఇన్సురెన్సు రూ. 50 లక్షలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే హామీలను అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాళ్లు పల్లవి, విజయ, సుమలత పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు ఎల్లారెడ్డి క్యాంపు ఆఫీస్‌లో వినతిపత్రం ఇచ్చారు.



కిక్కిరిసి.. ఇండ్లకు చేరి..




నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రభుత్వం విద్యాసంస్థలకు సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీంతో జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ విద్యార్థులతో కిక్కిరిసిపోయింది. సకాలంలో బస్సులు రాక గంటలతరబడి వేచిచూడాల్సి వచ్చింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ యాజమాన్యం అదనంగా సర్వీసులను నడిపించకపోవడతో సీట్ల కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికుల తంటాలు

## మా పిన్ని వేధిస్తున్నది..

- అధికారులతో గోడు వెళ్లబోసుకున్న ఓ బాలిక
- స్వధార్‌హోంకు అప్పగించిన పోలీసులు
- సదరు బాలికను కోటగిరి మండలం నుంచి బోధన్‌కు పంపించిన స్థానికులు

శక్కర్‌నగర్, జనవరి 10: తనను డబ్బులు అడుక్కొని రావాలంటూ తన పిన్ని నానా రకాలుగా వేధిస్తోందంటూ ఓ బాలిక అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. కోటగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 9న బోధన్ బస్టాండ్‌లో ఒంటరిగా ఉండగా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధి మహాలక్ష్మి గుర్తించగా పారాలీగల్ వలంటీర్లు పద్మాసింగ్, రమణా రెడ్డితో పాటు అంగన్‌వాడీ టీచర్ స్వరూప అక్కడికి వెళ్లి విచారించారు. తన తల్లి మృతి చెందగా, తండ్రి మరో పెండ్లి చేసుకొని వెళ్లిపోవడంతో పిన్ని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నదని సదరు బాలిక చెప్పింది. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు స్థానికులు తనను బోధన్ బస్సు ఎక్కించి పంపించారని తెలిపింది. బోధన్ పోలీసులు బాలికను స్థానిక స్వధార్‌హోంకు తరలించారు. శుక్రవారం నిజామాబాద్ సీడబ్ల్యూసీకి అప్పగిస్తామని తెలిపారు.

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
శ్రీ రాఘవేంద్ర కిడ్నీ & యూరో కేర్ సెంటర్
నిజామాబాద్ ఫోన్: 08462-220470, సెల్: 98487 42994
RIRS-Laser : మూత్రపిండం రాళ్ళకు రంధ్రం లేకుండా, లేజరుతో రాళ్ళు కరిగించబడును.
TURP : మూత్రనాళం ద్వారా ప్రొస్టేట్ గడ్డను తొలగించడం.
URSL: Ureteroscope పద్ధతిలో మూత్ర పిండం నాళములోని రాయిని కరిగించడం.
PCNL: Nephroscope పరికరముతో మూత్రపిండంలోని పెద్ద రాళ్ళను తీసివేయడం
ESWL : మూత్రపిండంలోని రాళ్ళను ఆపరేషన్ లేకుండా కరిగించడం.
మగవారిలోని సంతానలేమి మరియు వృంధత్వముకు చికిత్స పిల్లలలో కలిగే మూత్రపిండ మరియు మూత్ర సంబంధిత వ్యాధులకు చికిత్స.
Pyeloplasty : కిడ్నీ వాపుకు శస్త్ర చికిత్స
VIU / OIU : మూత్రనాళంకు శస్త్ర చికిత్స
Vasal Recanalization: Vasectomy తర్వాత మళ్ళీ సంతాన ప్రాప్తికి శస్త్ర చికిత్స
Tubal Recanalization: Tubectomy తర్వాత మళ్ళీ సంతాన ప్రాప్తికి శస్త్ర చికిత్స

డా॥ ఏ.రాఘవేందర్
M.S.(JIPMER), M.Ch.(Osm)
రి.నెం.40351
యూరాలజిస్ట్, లాపరోస్కోపిక్ సర్జన్ & ఆండ్రాలజిస్ట్